


EVENING EDITION
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
19-03-2025
పేజీలు: 02



## తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా

తెలంగాణ శాసనసభ శుక్రవారానికి వాయిదా పడింది. శుక్రవారం ఉదయం 10 గంటలకు సభ తిరిగి ప్రారంభం అవుతుందని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ప్రకటించారు. ఇక ఇవాళ ఉదయం 11.14 గంటలకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. గంటా 43 నిమిషాల పాటు భట్టి విక్రమార్క బడ్జెట్ ప్రసంగాన్ని చదివి వినిపించారు.







# సునీతా విలియమ్స్ వచ్చేసింది..

## ఫ్లోరిడాలో సురక్షితంగా దిగిన క్రూ డ్రాగన్



భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ సుదీర్ఘ నిరీక్షత తర్వాత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ISS) నుంచి భూమిపైకి తిరిగొచ్చారు. దాదాపు 9 నెలలపాటు అంతరిక్షంలో చిక్కుకుపోయిన ఆమె బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు అమెరికాలోని ఫ్లోరిడా తీరంలో సముద్ర జలాల్లో దిగారు. ఆమెతోపాటు ఆస్ట్రోనాట్స్ బుచ్ విల్మోర్, నాసాకు చెందిన కమాండర్ నిక్ హేగ్, రష్యా వ్యోమగామి అలెగ్జాండర్ గుర్బునోవ్ భూమిపైకి చేరుకున్నారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 10.35 గంటలకు ఐఎస్ఎస్ నుంచి బయల్దేరిన నాసా, స్పేస్ ఎక్స్‌కు చెందిన క్రూ-9 డ్రాగన్ ఫ్రీడమ్ క్యాప్సూల్ 17 గంటలపాటు ప్రయాణించి బుధవారం తెల్లవారుజామున 3.27 గంటలకు ఫ్లోరిడా తీరానికి చేరువలో సముద్ర జలాల్లో దిగింది. గంటకు 17 వేల మైళ్ల వేగంతో భూమివైపుగా ప్రయాణించిన ఈ డ్రాగన్ క్యాప్సుల్ క్రమంగా తన వేగాన్ని తగ్గించుకుంటూ వచ్చింది. ఈ క్రమంలో దాని వేగం గంటకు 116 మైళ్లకు చేరుకున్నాక పారాచూట్లు తెరచుకున్నాయి. 4 పారాచూట్ల సాయంతో వేగాన్ని మరింత తగ్గించుకొని క్యాప్సుల్ సురక్షితంగా సముద్ర జలాల్లో దిగింది. ఆ తర్వాత నాసా సిబ్బంది అక్కడికి చేరుకొని చిన్న బోట్ల సహాయంతో దానిని ఓ నౌకపైకి తీసుకొచ్చి ఒడ్డుకు చేర్చారు. అనంతరం వ్యోమగాములను హ్యూస్టన్‌లోని జాన్సన్ స్పేస్ సెంటర్‌కు తరలించారు. అక్కడ వారికి వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఇన్నాళ్లు ఐఎస్ఎస్‌లో జీరో గ్రావిటీలో గడిపిన ఈ వ్యోమగాములు ఇప్పుడు ఇక్కడ భూ గురుత్వాకర్షణ శక్తికి తిరిగి సర్దుబాటు అయ్యేలా నిపుణులు వారికి తోడ్పాటు అందించనున్నారు. కాగా, కేవలం 8 రోజుల యాత్ర కోసం గతేడాది జూన్ 5న ఐఎస్ఎస్‌కు వెళ్లిన సునీత, విల్మోర్.. ఏకంగా 286 రోజులు అక్కడే గడపాల్సి వచ్చింది.2024 జూన్ 5న ప్రయోగించిన బోయింగ్ వ్యోమనౌక స్టార్‌లైనర్‌లో సునీతా విలియమ్స్, బుచ్ విల్మోర్ ఐఎస్ఎస్‌కు చేరుకున్నారు. షెడ్యూల్ ప్రకారం అదే నెల 14న వారిద్దరు భూమిని చేరుకోవాల్సి ఉంది. అయితే స్టార్‌షిప్‌లో హీలియం లీకేజీ కారణంగా సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో వ్యోమగాములు లేకుండానే స్టార్‌లైనర్ భూమిని చేరుకుంది. దీంతో వీరిద్దరూ దాదాపు 9 నెలలు అంతరిక్ష కేంద్రంలోనే గడపాల్సి వచ్చింది.

**యాత్ర సాగిందిలా..**

భారత కాలమానం ప్రకారం మంగళవారం ఉదయం 8.15 గంటలకు క్రూ డ్రాగన్ వ్యోమనౌక తలుపు మూసివేత ప్రక్రియ జరిగింది.

ఉదయం 10.15 గంటలకు అది ఐఎస్ఎస్‌తో విడిపోవడం (అన్‌డాకింగ్) ప్రారంభమైంది. 10.35 గంటలకు పూర్తిగా విడిపోయింది. అనంతరం భూమి దిశగా 17 గంటల ప్రయాణాన్ని మొదలుపెట్టింది. దీనికోసం పలుమార్లు రాకెట్ ప్రజ్వలన విన్యాసాలు చేపట్టింది. భూమిపై ల్యాండింగ్ ప్రదేశం దిశగా క్రూ డ్రాగన్ ముందుభాగంలోని నాలుగు డ్రాకో ఇంజిన్ల ప్రజ్వలన మొదలైంది. ఏడున్నర నిమిషాలపాటు ఈ ప్రక్రియ సాగింది. తర్వాత భూవాతావరణంలో కి రీ ఎంట్రీ కోసం కోన్ భాగాన్ని వ్యోమనౌక మూసివేసింది. రీ ఎంట్రీ సమయంలో తలెత్తే తీవ్రస్థాయి వేడి నుంచి వ్యోమగాములను సురక్షితంగా ఉంటే వ్యవస్థ ఆన్ అయింది. బుధవారం తెల్లవారుజామున 2.51 గంటలకు కక్ష్య నుంచి విడిపోయే ప్రక్రియ పూర్తవడంతో స్పేస్ క్రాఫ్ట్ కిందికి దిగడం ప్రారంభమైంది. 3.10 గంటలకు భూ వాతావరణంలోకి ప్రవేశించింది. అయితే అత్యంత వేగంగా ప్రయాణిస్తుండటంతో స్పేస్ ఎక్స్ గ్రౌండ్ స్టేషన్‌తో కమ్యూనికేషన్ తెగిపోవడంతో (రేడియో సైలెన్స్) కొద్దిసేపు ఉత్కంఠ ఏర్పడింది.

3.21 గంటలకు మళ్లీ సిగ్నల్ కలవడంతో, రేడియో సైలెన్స్‌ను ఛేదిస్తూ కమాండర్ నిక్ హేగ్ మాట్లాడటంతో కమాండ్ సెంటర్‌లో అందరిలో ఆనందం వెల్లివిరిసింది.

సునీతా విలియమ్స్‌కు వెల్కమ్ చెప్పిన ఇస్రో చైర్మెన్ భారత సంతతి ఆస్ట్రోనాట్ సునీతా విలియమ్స్.. 9 నెలల తర్వాత స్పేస్ స్టేషన్ నుంచి భూమ్మీకి ఇవాళ చేరుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మెన్ వీ నారాయణన్ స్పందించారు. సురక్షితంగా నేలపై దిగిన సునీతాకు ఆయన వెల్కమ్ పలికారు. ఇదో అసాధారణ అచీవ్‌మెంట్ అన్నారు. నాసా, స్పేస్‌ఎక్స్ పనితీరుకు ఇదో సవాల్ అని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలపై కట్టుబడి ఉన్న అమెరికా కమిట్‌మెంట్‌కు ఇదో పరీక్షలాంటిదన్నారు. ఇస్రోకు చెందిన ఎక్స్ అకౌంట్‌లో నారాయణన్ స్పందించారు. అంతరిక్ష పరిశోధనల్లో సునీతా విలియమ్స్ అనుభవాన్ని వినియోగించుకోనున్నట్లు ఇస్రో చైర్మెన్ వెల్లడించారు. మీ దీక్ష, పట్టుదల.. ప్రపంచవ్యాప్తంగా ఉన్న అంతరిక్ష పరిశోధకులకు ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఇస్రో చైర్మెన్‌గా, భారత అంతరిక్ష శాఖ అధిపతిగా .. గ్రీటింగ్స్ చెబుతున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని భారత్.. అభివృద్ధి చెందిన దేశంగా ఎదుగుతోందని, ఈ నేపథ్యంలో మీ అనుభవాలను స్పేస్ కార్యక్రమాలకు వాడుకోవాలని ఆశిస్తున్నామని ఇస్రో చైర్మెన్ తెలిపారు. నాసా ఆస్ట్రోనాట్స్ బుచ్ విల్మోర్, సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఇద్దరు ఆస్ట్రోనాట్స్ ఇవాళ స్పేస్‌ఎక్స్ డ్రాగన్ క్యాప్సూల్‌లో నేలపై దిగారు. సునీతా విలియమ్స్ తండ్రి గుజరాతీ. ఆయన పేరు దీపక్ పాండ్యా. మెహసానా జిల్లాలోని జులసాన్ సొంతూరు. సునీతా తల్లి పేరు ఉరుసులిన్ బొన్ని పాండ్యా. ఆమె స్లోవేనియా దేశస్థురాలు.



# 3.04 లక్షల కోట్లతో బడ్జెట్..

# అసెంబ్లీలో ప్రవేశపెట్టిన భట్టి

2025-26 వార్షిక బడ్జెట్‌ను ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క శాసన సభలో ప్రవేశపెట్టారు. రూ.3,04,965 కోట్లతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.2,26,982 కోట్లు, మూలధన వ్యయం రూ.36,504 కోట్లుగా పేర్కొన్నారు. బడ్జెట్‌లో వ్యవసాయ శాఖకు 24,439 కోట్లు, పశుసంవర్ధక శాఖకు రూ.1674 కోట్లు, పౌరసరఫరాల శాఖకు రూ.5734 కోట్ల చొప్పన కేటాయించారు. కాగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇదే పూర్తి స్థాయి బడ్జెట్ కావడం విశేషం. ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ఇది మూడో బడ్జెట్ ప్రసంగం. ఈ సందర్భంగా ప్రజా ప్రయోజనాలే ధ్యేయంగా, పారదర్శకత, జవాబుదారీ తనంతో సాగుతున్న మా ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికిగాను వార్షిక బడ్జెట్‌ను సభలో ప్రవేశపెడున్నామని భట్టి విక్రమార్క చెప్పారు. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో రంగరించి జోడుగుర్రాల తరహాలో సుపరిపాలన రథాన్ని పరుగులు పెట్టించడంలో సఫలీకృతమయ్యామన్నారు. భారతదేశాన్ని రాజకీయ, ఆర్థిక, సామాజిక న్యాయం అమలుచేసే పటిష్ట దేశంగా చూడాలని అంబేద్కర్ నొక్కిచెప్పారన్నారు. రాజ్యాంగ నిర్మాత సూచించిన నైతిక విలువను పాటిస్తూ ప్రజాపాలన సాగిస్తున్నామని చెప్పారు.

**మూడో సారి భట్టి బడ్జెట్**

తెలంగాణ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమర్క బడ్జెట్ ప్రవేశపెట్టి ప్రసంగిస్తున్నారు. ఆర్థిక మంత్రిగా భట్టి మూడోసారి బడ్జెట్ ప్రవేశపెట్టారు. డ్జెట్ ప్రసంగం సందర్భంగా బీఆర్ఎస్ నేతల నినాదాలు.. కాంగ్రెస్ వ్యతిరేక నినాదాలు.

తెలంగాణ బడ్జెట్- రూ.3,04,965 కోట్లు
రెవెన్యూ వ్యయం- రూ.2,26,982 కోట్లు
మూలధన వ్యయం- రూ.36,504 కోట్లు
వ్యవసాయ శాఖ- 24,439 కోట్లు
పశుసంవర్ధక శాఖ- రూ.1674 కోట్లు
పౌరసరఫరాల శాఖ- రూ.5734 కోట్ల
విద్యారంగం- రూ.23,108 కోట్లు
కార్మిక శాఖ- రూ.900 కోట్లు
పంచాయతీరాజ్- రూ.31,605 కోట్లు
మహిళా శిశుసంక్షేమ శాఖ- రూ.2,862 కోట్లు
ఎస్సీ సంక్షేమం- రూ.40,232 కోట్లు
ఎస్టీ సంక్షేమం- రూ.17,169 కోట్లు
బీసీ సంక్షేమం- రూ.11,405 కోట్లు
మైనారిటీ సంక్షేమం- రూ.3,591 కోట్లు



ఐటీ శాఖ- రూ.7,704 కోట్లు
వైద్య ఆరోగ్యశాఖ- రూ.12,393 కోట్లు
విద్యుత్ శాఖ- రూ.21,221 కోట్లు
హెచ్ సిటీ డెవలప్మెంట్- రూ.150 కోట్లు
మున్సిపల్, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ- రూ.17,677 కోట్లు
నీటి పారుదల శాఖ- రూ.23,373 కోట్లు
రోడ్లు భవనాల శాఖ- రూ.5,907 కోట్లు
పర్యాటకశాఖ- రూ.775 కోట్లు
క్రీడా శాఖ- రూ.465 కోట్లు
ఫారెస్ట్ అండ్ ఎన్విరాన్మెంట్- రూ.1,023 కోట్లు
దేవాదాయశాఖ- రూ.190 కోట్లు
హోంశాఖ- రూ.10,188 కోట్లు

ప్రసంగంలో భట్టి ఇంకా ఏమన్నారంటే.. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. బడ్జెట్ ప్రవేశపెట్టిన మంత్రి భట్టి విక్రమార్క.. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రజాపాలన కొనసాగిస్తున్నామని అన్నారు. దేశానికే తెలంగాణను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. తెలంగాణ తాత్కాలిక, దీర్ఘకాలిక ప్రయోజనాలే ముఖ్యం. మాపై కొంతమంది సోషల్ మీడియాలో అసత్యపు ప్రచారం చేస్తున్నారని, అబద్ధపు వార్తలతో ప్రజలు మోసం చేస్తున్నారని అన్నారు. అబద్ధపు విమర్శలను తిప్పి కొడుతూ వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం మా బాధ్యత. అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలన అనే మూడు అంశాలు మా నినాదం అని అన్నారు. తెలంగాణ రైజింగ్ 2050 అనే ప్రణాళికతో సీఎం పాలనను ముందుకు నడిపిస్తున్నారు. నేడు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పరిణామం 200 బిలియన్ డాలర్లు. రాబోయే ఐదేళ్లలో ఐదు రెట్లు అభివృద్ధి చేసి 1000 బిలియన్ డాలర్లు ఉండేలా కార్యాచరణ ఉందన్నారు.

**త్వరలో అంగన్‌వాడీ పోస్టులు భర్తీ**

త్వరలో 14,236 అంగన్‌వాడీల పోస్టుల భర్తీను భర్తీ చేయనున్నట్లు మంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. గృహజ్యోతి పథకంతో 50 లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని, రూ.22,500 కోట్లతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. అలాగే రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి కనీసం 3500 ఇళ్ల నిర్మాణం చేపడుతున్నామని, ORR ఆనుకుని హైదరాబాద్ నాలుగువైపులా శాటిలైట్ టౌన్‌షిప్‌లు నిర్మించనున్నట్లు చెప్పారు. రూ.2 లక్షలలోపు రైతురుణాలు మాఫీ చేశామని, 25.35 లక్షల మంది రైతులకు 20,616 కోట్లు మాఫీ జరిగిందన్నారు.

**ఇందిరమ్మ ఇళ్లకు భారీగా నిధులు**

ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఈ బడ్జెట్‌లో భారీగానే నిధులు కేటాయించే అవకాశం ఉంది. నాలుగేళ్లలో 20 లక్షల మందికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం తెలిపింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి 37 వేల 274 కోట్లు కావాలని అధికారులు ప్రతిపాదించారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత లోక్‌సభ ఎన్నికల కారణంగా 2024 ఫిబ్రవరిలో తొలుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది రేవంత్ సర్కార్. ఏప్రిల్, మే, జూన్ నెలల కోసం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. 2024 జులై 25న పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది కాంగ్రెస్ సర్కార్. అయితే ఒక ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను ఇప్పుడే ప్రవేశపెట్టింది రేవంత్ సర్కార్.

## సినిమాలకి గుడ్ బై చెప్పిన నటి హేమ

నటి హేమ మంచి టాలెంట్ ఉన్న ఆర్టిస్ట్. ఎన్నో సూపర్ హిట్ చిత్రాలలో తన నటనతో ప్రేక్షకులని ఎంతగానో అలరించింది. ఒకప్పుడు హేమ అంటే ఆమె నటించిన క్యారెక్టర్స్ గుర్తుకు వస్తాయి. ఇప్పుడు అయితే డ్రగ్స్ కేసూ.. ఇతర వివాదాలు.. అవి ఇవీ గుర్తొస్తుంటాయి . హేమ 'అతడు' సినిమాలో బ్రహ్మానందంతో కలిసి చేసిన కొన్ని సీన్స్‌కి జనాలు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుకున్నారు. నటి హేమ ఎన్ని సినిమాలు చేసినా కూడా.. అతడు సినిమా గురించే అడుగుతుంటారు. అయితే అలాంటి పాత్రలు ఎప్పుడుచేస్తారు హేమా గారూ అని అడగగా, అలాంటి పాత్రలు కాదు.. అసలు ఇకపై ఎలాంటి పాత్రలు చేయనంటూ పెద్ద షాక్ ఇచ్చింది నటి హేమ.నేను 14 ఏళ్ళ వయసు నుంచి కష్టపడుతున్నా. ఇకపై విశ్రాంతి తీసుకుంటూ ఎంజాయ్ చేయాలనుకుంటున్నా అని చెప్పకొచ్చింది . జీవితాంతం కష్టపడుతూనే ఉండాలా, కొంచెం చిల్ అవ్వాలి కదా అందుకే చిల్ అవుతున్నా. సినిమాలకు, నటనకు దూరంగా ఉండాలని డిసైడ్ అయ్యాను. బాహుబలిలో శివగామి లాంటి పాత్ర ఇచ్చినా చేయను అని హేమ తేల్చి చెప్పింది.



సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM



## శబరిమల అయ్యప్పను దర్శించుకున్న మోహన్ లాల్

భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల్లో ఒకటైన కేరళలోని శబరిమల అయ్యప్ప స్వామిని మలయాళ స్టార్ నటుడు మోహన్ లాల్ దర్శించుకున్నాడు. మాల ధరించిన లల్లెట్టన్ ఇరుముడి కట్టుకుని కాలినడకలో అయ్యప్ప దర్శనంకి వచ్చాడు. ఆలయంకి చేరుకున్న మోహన్‌లాల్ 18 మెట్లు ఎక్కి ఆ మణికంఠుడిని దర్శించుకున్నాడు. ఇక మోహన్ లాల్ రాకతో ఆలయ అధికారులు అతడికి ఘనస్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.

### తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ప్రభు దేవా..

## సెల్ఫీల కోసం ఎగబడ్డ భక్తులు

కలియుగ దైవం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ప్రముఖ డ్యాన్స్ కొరియోగ్రాఫర్, దర్శకుడు ప్రభుదేవా దర్శించుకున్నారు. బుధవారం ఉదయం వీఐపీ విరామ దర్శన సమయంలో శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఉదయం ఆలయానికి చేరుకున్న ప్రభుదేవాకు టీటీడీ అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో శేష వస్త్రంతో సత్కరించారు. స్వామివారి తీర్థప్రసాదాలు, చిత్రపటం అందజేశారు. ఆలయం వెలుపల ప్రభు దేవాను చూసేందుకు భక్తులు ఉత్సాహం చూపించారు. ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడ్డారు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది



### పాండ్యాపై బ్యాన్.. చెన్నైమ్యాచ్‌కు కెప్టెన్‌గా

## సూర్యకుమార్

ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై ఒక మ్యాచ్ సస్పెన్షన్ ఉన్న విషయం తెలిసిందే. దీంతో చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే ఐపీఎల్ ఫస్ట్ మ్యాచ్ కు అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. గత సీజన్‌లో ఓవర్ రేట్ తప్పిదానికి పాల్పడిన నేపథ్యంలో పాండ్యాపై ఒక మ్యాచ్ బ్యాన్ విధించారు. ఆదివారం చెన్నైతో జరిగే మ్యాచ్‌లో ముంబై జట్టుకు సూర్య సారథ్య బాధ్యతలు చేపట్టనున్నట్లు పాండ్యా తెలిపాడు. భారత సీనియర్ టీ20 జట్టుకు సూర్యకుమార్ యాదవ్ కెప్టెన్సీ చేపడుతున్నాడు. అతని నేతృత్వంలోని ఇండియా జట్టు ఇటీవల 4-1 తేడాతో ఇంగ్లండ్‌పై హోమ్ సిరీస్ నెగ్గిన విషయం తెలిసిందే. అయితే ఆ సిరీస్‌లో సూర్య బ్యాటింగ్‌లో రాణించలేదు. 5 ఇన్నింగ్స్‌లో అతను కేవలం 38 రన్స్ మాత్రమే చేశాడు. అయితే ముంబై ఇండియన్స్ జట్టు ప్రీ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో ఇవాళ పాండ్యా మాట్లాడుతూ.. ఇండియాకు సూర్య లీడ్ చేస్తున్నాడని, తాను లేని పక్షంలో అతనే ఉత్తమ ఛాయిస్ అవుతాడని పేర్కొన్నాడు.

### తొండ ముదిరితే ఊసరవెల్లి..

## ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి



తెలంగాణ బడ్జెట్(2025-2026)పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. ఇది పేద ప్రజల కష్టాలు తీర్చే బడ్జెట్ కాదని, ఢిల్లీకి మూటలు పంపే బడ్జెట్ అంటూ ఆరోపించారు. తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుందని, ఊసరవెల్లి ముదిరితే రేవంత్ రెడ్డి అవుతారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్ అందమే సక్కగా లేదని, కానీ అందాల పోటీలు పెట్టేందుకు సిద్ధమవుతోందంటూ మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేటీఆర్ మాట్లాడుతూ.."రేవంత్ రెడ్డీ.. రంకెలు వేయడం కాదు బడ్జెట్ అంకెలు ఎటు పోయాయ్. ఆకాశం నుంచి పాతాళానికి బడ్జెట్ పోతోంది. పరిపాలన చేతకాని ప్రభుత్వం కాంగ్రెస్. ఈ బడ్జెట్‌లో ఆరు గ్యారంటీలు గోవిందా. వాటికి పాతర వేశారు. మహిళలు, వృద్ధులకు ఇచ్చిన హామీలను బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. తులం బంగారానికే దిక్కు లేదు. చేనేతకు బీఆర్ఎస్ హయంలో రూ.1,200 కోట్లు కేటాయించాం. కానీ ఇవాళ చేనేత కార్మికులను రూ.300 కోట్లు పరిమితం చేశారు. ఆటో కార్మికుల గురించి ప్రస్తావనే లేదు. యాదవ సోదరుల ప్రసక్తే లేదు. వైన్స్ షాపుల్లో 25 శాతం రిజర్వేషన్ గౌడన్నలకు ఇస్తామని హామీ ఇచ్చారు. అదీ కనిపించడం లేదు. చివరికి దళిత సోదరులనూ మోసం చేశారు. నిరుద్యోగులకు ఒక్క హామీ ఇవ్వలేదు. ఉద్యోగాలు ఇచ్చింది కేసీఆర్, కానీ నియామక కాగితాలు ఇచ్చింది మాత్రం ఈ కాంగ్రెస్ ప్రభుత్వం" అని అన్నారు.

**పంటలు ఎండిపోతుంటే అందాల పోటీలా.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేల నిరసన**

పంటలు ఎండిపోతుంటే అందాల పోటీలా..అని తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ లాబీ వరకు నినాదాలు చేస్తూ సభలోకి వెళ్లారు. కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ తెచ్చిన కరువు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ కాక, రైతుబంధు రాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గోదావరి, కృష్ణా నదిలో నీళ్లు సక్రమంగా వాడుకోలేక పంటలు ఎండబెడుతున్నాయి. ప్రభుత్వం, రేవంత్ రెడ్డి కళ్లు తెరిపించేందుకు ఎండిపోయిన వరితో నిరసన తెలిపాం.. అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. సకాలంలో వర్షాలు పడినా, ప్రాజెక్టుల్లో నీళ్లు నింపలేదు. మేడిగడ్డ ఎండబెట్టి సిగ్గులేకుండా ఇసుక అమ్మకాలు చేస్తుంది. 36 శాతం కృష్ణాజలాలు గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపయోగించుకుంటే.. రేవంత్ సర్కార్ కనీసం 22 శాతం కూడా వాడలేదు. కిందకి నీళ్లు వదిలి చంద్రబాబు మీద ప్రేమతో ఇక్కడి పంటలు ఎండబెట్టింది. వరి చేలలో గొర్రెలు మేస్తున్నాయి. ఎక్కడెక్కడ పంటలు ఎండిపోయాయో ఆ రైతులను ఆదుకోవాలి. చెరువులు నింపలేని తెలివి తక్కువ తనం కాంగ్రెస్‌ది. పాడైపోయిన బ్యారేజ్ రిపేర్ చేయకుండా తెలివి తక్కువ తనంతో కాంగ్రెస్ ప్రభుత్వం సిగ్గులేని చర్యలకు పాల్పడుతోంది. పంటలు ఎండిపోయిన ప్రాంతాల్లో పర్యటిస్తాం. ఎండిన పంట పొలాలకు ఎకరానికి రూ.25 వేల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని. కేటీఆర్ అన్నారు.

**దమ్ముంటే అశోక్‌నగర్‌కు రా.. రాహుల్ గాంధీకి కేటీఆర్ సవాల్**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని నిరుద్యోగులను మోసం చేసిన రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. బడ్జెట్ ప్రసంగం ముగిసిన అనంతరం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద కేటీఆర్ మాట్లాడారు. అధికారంలోకి రాగానే తొలి ఏడాది 2 లక్షల ఉద్యోగాలని రాహుల్ నరికిండు. ఇవాళ నిరుద్యోగుల గురించి ప్రస్తావన లేదు. ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ విషయంలో మందికి పుట్టిన బిడ్డలు మా బిడ్డలని చెప్పకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి రాష్ట్రంలోని నిరుద్యోగులు నవ్వుతున్నారు. కేసీఆర్ ఉద్యోగాలు ఇస్తే.. కాగితాలు ఇచ్చిన సన్నాసులు మీరు. 2 లక్షల ఉద్యోగాల గురించి డిమాండ్ చేస్తున్నా.. దరమ్ముంటే రా రాహుల్ గాంధీ.. అశోక్ నగర్‌కు రా.. చర్చ పెట్టి ఉద్యోగాల భర్తీ ఏమైందో చెప్పాలని డిమాండ్ చేస్తున్నాను. నిరుద్యోగ భృతి, యువ వికాసం అన్నారు.






### స్పోర్ట్స్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి..

## శాట్స్ చైర్మన్‌కు ఎస్‌జాట్ ప్రతినిధుల వినతి

స్పోర్ట్స్ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనారెడ్డిని స్పోర్ట్స్ జర్నలిస్టు అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు కోరారు. మంగళవారం ఎల్బీ స్టేడియంలో అసోసియేషన్ ప్రతినిధులు శాట్స్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేశారు. తెలంగాణలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడంతో పాటు క్రీడాభివృద్ధిలో స్పోర్ట్స్ జర్నలిస్టులు, SJAT కీలకంగా వ్యవహరిస్తున్నది. చాలా కాలంగా క్రీడా పాత్రికేయులుగా సేవలందిస్తున్న జర్నలిస్టులను ప్రభుత్వం గుర్తించి ఇండ్ల స్థలాలు కేటాయించాలని ఎస్‌జాట్ ప్రతినిధులు కోరారు. ఈ సందర్భంగా శివసేనారెడ్డి మాట్లాడుతూ 'క్రీడా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంలో స్పోర్ట్స్ జర్నలిస్టుల పాత్ర విలువైనది.




## పార్లమెంట్‌ను సందర్శించిన బిల్‌గేట్స్

మైక్రోసాఫ్ట్ మాజీ సీఈవో బిల్‌గేట్స్ ఢిల్లీలో పర్యటిస్తున్నారు. పర్యటనలో భాగంగా బిల్‌గేట్స్ పార్లమెంట్ భవనాన్ని సందర్శించారు. కేంద్ర మంత్రి, బీజేపీ జాతీయ అధ్యక్షుడ జేపీ నడ్డాతో బిల్‌గేట్స్ సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై చర్చించినట్లుగా తెలుస్తోంది. ఇదిలా ఉంటే మధ్యాహ్నం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిల్‌గేట్స్ సమావేశం కానున్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయ సహకారం గురించి చర్చించనున్నారు. పలు ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంది. మూడేళ్లలో బిల్‌గేట్స్‌కి ఇది మూడో పర్యటన కావడం విశేషం.

## నేవీ ఆఫీసర్‌ను లవర్‌తో కలిసి చంపేసిన భార్య

అక్రమ సంబంధం దారుణమైన మర్డర్ కు దారి తీసింది. యూపీలో ఆ హత్యా ఘటన చోటుచేసుకున్నది. స్టోరీలోకి వెళ్తే.. మీరట్‌కు చెందిన సౌరభ్ రాజ్‌పుత్ ఓ మెర్చంట్ నేవీ ఆఫీసర్. 2016లో అతను ముస్కాన్ రస్తోగిని లవ్ మ్యారేజ్ చేసుకున్నాడు. కానీ సాహిల్ శుక్లా అనే వ్యక్తితో ముస్కాన్ మరో రిలేషన్‌లో ఉన్నది. ముస్కాన్, సాహిల్.. ఓ ప్లాన్ వేసి నేవీ ఆఫీసర్‌ను హత్య చేశారు. అతని శరీరాన్ని 15 ముక్కలుగా కోసేశారు. ఓ డ్రమ్ములో ఆ ముక్కల్ని వేసి సిమెంట్‌తో సీల్ చేశారు. ఈ హీనమైన క్రైం గురించి పోలీసులు చాలా ఆసక్తికర విషయాలు చెప్పారు. ముస్కాన్‌ను ప్రేమ పెళ్లి చేసుకున్న సౌరభ్.. తన భార్యతో ఎక్కువ సమయం గడపాలనుకున్నాడు. దీంతో అతను నేవీ జాబ్‌ను వదిలేశాడు. ఆ నిర్ణయం ఇద్దరి కుటుంబాల్లో వివాదం సృష్టించింది. సౌరభ్ ఇళ్లు విడిచి వెళ్లిపోయాడు.





### విద్యాశాఖపై చర్చ పెడితే ఎందుకు పారిపోయారు..

## మంత్రి లోకేశ్ వార్నింగ్

వైసీపీ హయాంలో ఎంతమంది విద్యార్థులు ఏ స్కూల్ లో చదువుతున్నారో డేటా లేదని, విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన బొత్స.. డేటా ఎందుకు లేదో సమాధానం చెప్పాలని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలలు, ఇంటర్ లో 12 లక్షల మంది విద్యార్థులు తగ్గారనే అంశంపై మండలి పక్ష నేత బొత్స సత్యనారాయణ అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. విద్యారంగంపై సభలో చర్చ జరిగినప్పుడు వైసీపీ సభ్యులు పారిపోయారు. ఇప్పుడు ప్రశ్నిస్తున్నారు. హౌస్ అజెండా బీఏసీ నిర్ణయిస్తుంది. విద్యలో సంస్కరణలపై చర్చ జరగాలని వైసీపీనే కోరింది. మేం సన్నద్ధమై సభకు వచ్చాం. హౌస్ ఛైర్మన్ ఆదేశాల ప్రకారం నడుస్తుంది. ప్రతిపక్ష పార్టీ చెప్పినట్లు నడవదు. తమకు కావాల్సినప్పుడు చర్చ పెట్టాలని, ఈ రోజు మూడ్ బాగాలేదు, మేం బయటకు వెళ్లాలని, వేరే పనులు ఉన్నాయని, పార్టీ మీటింగ్ లు ఉన్నాయని వాయిదా వేయాలనుకుంటే అందుకు ప్రభుత్వం, ఛైర్మన్ సిద్ధంగా లేరని మండిపడ్డారు. బొత్స సీనియర్ నాయకులని, మంత్రిగా పనిచేశారని, ఆలోచించి మాట్లాడాలని అన్నారు. విద్యారంగంపై సభలో విపులంగా చర్చించడం జరిగింది.

## నా గురించి మాట్లాడే అర్హత నీకు లేదు

బాలీవుడ్ ఫైర్ బ్రాండ్ గా గుర్తింపు తెచ్చుకుంది స్టార్ హీరోయిన్ కంగనా రనౌత్. మూవీస్ విషయం కాస్త పక్కన పెడితే.. తన జోలికి ఎవరైనా వస్తే మాత్రం చెంపదెబ్బ కొట్టినట్టు సమాధానం ఇస్తుంది. రీసెంట్‌గా కంగన్న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జీవితం ఆధారంగా 'ఎమర్జెన్సీ' అనే చిత్రం ద్వారా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు దర్శకత్వం వహించడంతో పాటు నిర్మాతగానూ వ్యవహరించిన కంగనా. ఎన్నో అడ్డంకులు దాటుకుని ఈ ఏడాది విడుదలైన ఈ చిత్రం నార్మల్ టాక్ తెచ్చుకుంది. కంగనా ఇంత చక్కగా రూపొందిస్తారని నేను ఊహించలేదు. ఆమె నా అంచనాలు తారుమారు చేశారు. ఇదొక అద్భుతమైన చిత్రం. ఈ సినిమాను ఆమె తెరకెక్కించిన తీరు.. ఆమె నటన చాలా బాగుంది' అని ఆయన రాసుకొచ్చారు. అయితే ఈ మాటల పై కంగనా ఫైర్ అయ్యింది..'నా పై ముందుగానే ఒక అభిప్రాయానికి వచ్చినట్టు ఆయన తన పోస్ట్ లో తెలిపారు. నేను ఎలాంటి సినిమా చేశానో మీకు ముందే ఎలా తెలుసు..! నా గురించి ముందే తెలుసుకునేందుకు మీ వద్ద ఏమైనా అద్భుత శక్తులు ఉన్నాయా? ఒక వ్యక్తి గురించి ఒక అభిప్రాయానికి రావడానికి ముందు వాళ్ల గురించి అన్ని విషయాలు తెలుసుకోవాలి. అయినా నన్ను జడ్జ్ చేసేందుకు మీకున్న అర్హతలు ఏమిటి? మీరు ఎలాంటి సినిమాలు రూపొందించారు? ఇండస్ట్రీలో ఉన్నవాళ్లు ఎలాంటి సినిమాలు తెరకెక్కిస్తున్నారో ఒక్కసారి చెక్ చేసుకోవాలి' అని గట్టిగా ఇచ్చి పడేసింది కంగనా.